సాక్షి ప్రకాశం

శనివారం । 28 । సెప్టెంబర్ । 2024



సైబర్ నేరాల కట్టడికి చర్యలు

సైబర్ నేరాలను కట్టడి చేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. శుక్రవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. - 8లో..



భూసేకరణ వేగవంతం చేయాలి

జిల్లాలో జాతీయ రహదారులు, ప్రతిపాదిత రైల్వే మార్గాలకు భూసేకరణను వేగవంతం చేయాలని జేసీ గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
33.9/27.9

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల ఉరుములు మెరుపులతో జల్లులు పడవచ్చు.

న్యూస్‌రీల్

ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

- ఏపీ టీచర్స్ గిల్డ్ వినతి

ఒంగోలు: ఎయిడెడ్ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోదూరి వెంకట్రావు, సీహెచ్ ప్రభాకరరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎయిడెడ్ ఏకోపాధ్యాయ పాఠశాలలకు రెండో టీచర్ కేటాయించాలని, విద్యార్థులు లేని ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసే 75 మంది ఉపాధ్యాయులకు శాశ్వత కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు. పుల్లలచెరువు మండలం మానేపల్లి ఉమామహేశ్వర ఎయిడెడ్ పాఠశాలలో పదవీ విరమణ పొందిన ఇద్దరు ఉపాధ్యాయుల సర్వీస్ రిజిస్టర్ ను మూడు నెలల నుంచి డీఈవో కార్యాలయంలో ఉంచుకున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దొనకొండ ఇందిరాగాంధీ ఓరియంటల్ ఎయిడెడ్ పాఠశాలలో పనిచేసే ముగ్గురు ఉపాధ్యాయుల జీతాల సమస్య పరిష్కరించాలని, కొమరోలు మండలం గోపాన పల్లి ఏబీఎం ఎయిడెడ్ పాఠశాల లో పనిచేసే ఐదుగురు ఉపాధ్యాయుల ఇంక్రిమెంట్ల సమస్యలను జిల్లా విద్యాశాఖ అధికారి సత్వరమే పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కే వెంకట్రావు ప్రభాకర్ రెడ్డి రారు.

యోగివేమన స్పోర్ట్స్ బోర్డు ఎక్స్‌పర్ట్ మెంబర్‌గా దేవీ ప్రసాద్



ఒంగోలు: వైఎస్సార్ కడప జిల్లాలోని యోగి వేమన యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ బోర్డు ఎక్స్‌పర్ట్ మెంబర్ గా ఆంధ్ర కేసరి యూనివర్శిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్, హెచ్.ఓ.డి.డాక్టర్ ఐ. దేవీ వరప్రసాద్‌ను నియమిస్తూ వై.వి.యూ. స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ డాక్టర్ కే.రామ సుబ్బారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. వచ్చే నెల 1 న ఉదయం 11.30 గంటలకు వై.వి.యూ. ఉప కులపతి ప్రొఫెసర్ కె.కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక వైస్ చాన్సలర్ చాంబర్‌లో జరిగే ప్రత్యేక సమావేశానికి హాజరు కావాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సమావేశంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి స్పోర్ట్స్ విధానాలను అభివృద్ధి పరచడం, ఇంటర్ యూనివర్శిటీ టోర్నమెంట్స్, ఇంటర్ కాలిజియేట్ టోర్నమెంట్స్ నిర్వహణ, ఖేలో ఇండియా పోటీల నిర్వహణ తదితర అంశాల గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు.

జిల్లా హాకీ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



అండర్-17 హాకీ జిల్లా పోటీలకు ఎంపికైన బాలికలు

చీమకుర్తి: స్కూలు గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో త్వరలో జిల్లా స్థాయిలో నిర్వహించనున్న అండర్–14, 17 హాకీ పోటీలకు సంబంధించి బాలబాలికల జట్లను శుక్రవారం సంతనూతలపాడు మండలం మైనంపాడు ప్రభుత్వ హైస్కూలులో ఎంపిక చేశారు. స్కూలు గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ వనజ, పీఈటీ రవికుమార్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. జిల్లాలోని పలు హైస్కూళ్ల నుంచి 190 మంది క్రీడాకారులు హాజరయ్యారు. అండర్–14, 17 విభాగాల్లో బాలబాలికల జట్లను వేరువేరుగా ఎంపిక చేశారు.

నేడు ఒంగోలు రానున్న జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు

- జిల్లాలో రెండు రోజుల పాటు పర్యటన

ఒంగోలు సబర్బన్: జాతీయ షెడ్యూల్డ్ తెగల (ఎస్టీ) కమిషన్ సభ్యులు జాతోతో హుస్సేన్ శనివారం ఒంగోలు రానున్నారు. ఈ మేరకు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి పి.జగన్నాథరావు శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. న్యూ ఢిల్లీ నుంచి ఆయన శనివారం ఉదయం ఒంగోలుకు చేరుకుంటారు. తరువాత ఉదయం 9 గంటలకు చీమకుర్తిలోని గిరిజన గురుకుల పాఠశాలను సందర్శిస్తారు. అనంతరం కొత్తపట్నం రోడ్డులోని కొప్పోలు-చింతల మధ్య ఉన్న నక్కల కాలనీని పరిశీలిస్తారు. అక్కడ నుంచి కొత్తపట్నం మండలంలోని రంగాయపాలెం యానాది కాలనీలోని తుఫాను షెల్టర్‌లో స్థానిక గిరిజనులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహిస్తారు. స్థానికుల నుంచి సమస్యలపై అర్జీలు కూడా స్వీకరిస్తారు. అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్‌తో పాటు ఇతర జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిస్తారన్నారు. రెండో రోజు ఆదివారం ఉదయం 10 గంటలకు ఒంగోలు నగరంలోని అంబేడ్కర్ భవన్‌లో అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశానికి హాజరవుతారు. అనంతరం సమావేశం పూర్తయిన వెంటనే ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు బయలుదేరి వెళతారని వివరించారు.



జరుగుమల్లి మండలం పాలేరు నుంచి కలికవాయి గ్రామం మీదుగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణా



కనుమళ్ల చెరువులో భారీగా మట్టి తవ్వకాలు

వీళ్లు కన్నేస్తే.. కొల్లగొట్టేస్తారు..

అధికార పార్టీ నాయకుల కన్ను సహజ వనరులపై పడింది. ఇసుక..మట్టి మాఫియా అడ్డూ అదుపూ లేకుండా చెలరేగిపోతోంది. కొండా..గుట్ట..వాగూ..వంకా అదీ ఇదీ అనే తేడా లేకుండా అడ్డగోలుగా దోచేస్తున్నారు. సహజ వనరులను అక్రమంగా తవ్వేసి అప్పనంగా డబ్బు సంపాదిస్తున్నారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని.. పలుకుబడి ఉపయోగించి యథేచ్ఛగా దందా నడిపిస్తున్నారు. అధికార పార్టీ నేతల అనుచరులు అక్రమాలకు తెగబడుతుంటే.. ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి ఇలాఖాలో అక్రమ గ్రావెల్ తవ్వకాలతో ఇప్పటి వరకు సుమారు రూ.4 కోట్ల మేర పచ్చ నేతలు పోగేసుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- మంత్రి ఇలాకాలో సంపద తెలుగు తమ్ముళ్ల దోపిడీ
- రేయింబవళ్లు సహజ వనరులను తవ్వేస్తున్నారు
- వంద రోజుల్లో రూ.నాలుగు కోట్ల విలువైన ఇసుక, మట్టి మింగేశారు
- భారీ గోతులతో బావురుమంటున్న చెరువులు
- మాకేమీ కనపడవంటున్న మైనింగ్, పోలీసు అధికారులు

సాక్షి ప్రతినిధి, ఒంగోలు: జిల్లాలో కొండపి నియోజకవర్గం ఇసుక, మట్టి మాఫియాకు కేరాఫ్ అడ్రస్‌గా మారింది. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన వెంటనే తెలుగు తమ్ముళ్లు గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాకు తెరలేపారు. నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక, గ్రావెల్ అక్రమ రవాణా జరుగుతున్నా వివిధ శాఖల అధికారులు మాత్రం పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అధికారులు మామూళ్ల మత్తులో మునిగి తేలుతున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. మంత్రి డోల బాల వీరాంజనేయస్వామి సొంత నియోజకవర్గంలో ఇప్పటి వరకూ సుమారు రూ.4 కోట్ల విలువైన గ్రావెల్‌ను తరలించి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సింగరాయకొండ మండలంలోని శానంపూడి ప్రాంతంలోని మన్నేరు నుంచి, జరుగుమల్లి మండలం కే బిట్రగుంట, కామేపల్లి, జరుగుమల్లిలోని పాలేరు నుంచి అలాగే సదరన్ ఆక్వా సమీపంలో పాలేరు, కొండపి మండలం లోని అట్లేరు, మర్రిపూడి మండలంలో ముసి నుంచి మండలంలోని వివిధ గ్రామాలతో పాటు, చీమకుర్తి మండలానికి, పొన్నలూరు మండలం వేంపాడు, రావులకొల్లు, ఉప్పలదిన్నె, కొత్తపాలెం, కందుకూరు నియోజకవర్గం లింగసముద్రం మండలం వీఆర్ కోట నుంచి పొన్నలూరు, కనిగిరి మండలాలకు ప్రతిరోజు వందలాది ట్రాక్టర్లలో యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా జరుగుతోందనేది బహిరంగ రహస్యం.



రాత్రి వేళల్లో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్



తహశీల్దార్ కార్యాలయం ముందుగా బుధవారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో అక్రమంగా తరలిస్తున్న ఇసుక

చెరువుల్లో భారీ గుంతలు

సింగరాయకొండ మండలంలోని మూలగుంటపాడు పంచాయతీ జువ్వలగుంట, సోమరాజుపల్లి పంచాయతీలోని రాజుచెరువు, మర్రిచెరువు, పాంచ్ చెరువు, బింగినపల్లి చెరువు, కనుమళ్ల చెరువు, శానంపూడి చెరువుల్లో తెలుగు తమ్ముళ్లు ఇష్టారాజ్యంగా గ్రావెల్ అక్రమ రవాణా జోరుగా సాగిస్తున్నారు. అంతేకాక శానంపూడి పంచాయతీలోని ఉలవపాడు మండలం నీలకంఠేశ్వరస్వామి దేవస్థాన భూములతో పాటు, పాతసింగరాయకొండ వరాహలక్ష్మీ నరశింహస్వామి భూములు, ప్రభుత్వ భూముల్లో కూడా అక్రమ తవ్వకాలు జరిపి ఇష్టారాజ్యంగా గ్రావెల్‌ను తరలించుకుపోతున్నారు. గతంలో ట్రాక్టర్ గ్రావెల్ ధర రూ.600 నుంచి రూ.700 ఉండగా ప్రస్తుతం వెయ్యి రూపాయలు ఉందని, టిప్పర్ ధర సుమారు రూ.10 వేలు ఉందని సమాచారం.

అనధికార లేఅవుట్లకు గ్రావెల్ సరఫరా

నియోజకవర్గ సమీపంలోని పట్టణాల్లో ఉన్న అనధికార లేఅవుట్లకు అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రావెల్ సరఫరా చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారికి సంబంధించి విమానాల రన్‌వే సమీపంలోని లేఅవుట్లే ఇందుకు నిదర్శనమని స్థానికులు చెబుతున్నారు. అక్రమ గ్రావెల్‌తో లేఅవుట్లను సుందరంగా తీర్చిదిద్ది తమకు అన్ని రకాల అనుమతులు ఉన్నాయని మభ్యపెట్టి మమ్మల్ని నట్టేట ముంచుతున్నారని ప్లాట్ల కొనుగోలుదారులు ఆరోపిస్తున్నారు. అక్రమ లేఅవుట్లను అరికట్టాల్సిన పంచాయతీ, రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తూ ఉన్న పనులు చాలక అన్ని పనులు చూడాలంటే మావల్ల కాదని తప్పించుకుంటూ ప్లాట్ల కొనుగోలుదారులను గాలికి వదిలేశారని ప్రజలు విమర్శిస్తున్నారు.

మామూళ్ల మత్తులో అధికార యంత్రాంగం..

సింగరాయకొండ మండలంలోని శానంపూడి, జరుగుమల్లి మండలం కేబిట్రగుంట, జరుగుమల్లి ప్రాంతాల నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే పోలీసు, రెవెన్యూ, మైనింగ్, పంచాయతీ అధికారులు ఎవరికి వారు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ అక్రమార్కులకు దాసోహం అంటున్నారు. మామూళ్ల మత్తులో అంటకాగుతూ అక్రమార్కులను వదిలేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఇటీవల ప్రభుత్వం వాగులు, వంకల్లో ఎద్దుల బండ్ల ద్వారా ఇసుక ఉచితంగా రవాణా చేసుకోవచ్చని సూచించడంతో పాటు ఇసుక నిల్వల లభ్యతపై నివేదిక అందించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించింది. ఈ జీవోను అడ్డుపెట్టుకుని అక్రమార్కులు ఇష్టారాజ్యంగా ట్రాక్టర్లు, టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణా చేస్తూ లక్షలాది రూపాయలు ఆర్జిస్తున్నారు. ప్రస్తుతం ట్రాక్టరు ఇసుక రూ.4 వేల నుంచి రూ.5 వేలకు అమ్ముకుంటూ సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలున్నాయి. జరుగుమల్లిలోని మున్నంగి సీ ఫుడ్స్ సమీపంలో పాలేరు నుంచి కొద్ది రోజులుగా టంగుటూరు మండలం జమ్ములపాలేనికి చెందిన టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో రాత్రి వేళల్లో భారీగా టిప్పర్ల తో ఇసుక అక్రమ రవాణా జరుగుతోంది. ఇది తెలిసినా ఒక్క అధికారి కూడా పట్టించుకోవటం లేదు. గత వారం రోజుల్లోనే సుమారు కోటి రూపాయలకు పైగా ఇసుక అక్రమ రవాణా జరిగిందంటే పరిస్థితి ఏవిధంగా ఉందో అవగతమవుతుంది.

అధికారులపై తెలుగు తమ్ముళ్ల జులుం..

గురువారం జేసీ గోపాలకృష్ణ జరుగుమల్లి రెవెన్యూ కార్యాలయానికి వచ్చి ఇసుక అక్రమ రవాణా జరుగుతుంటే ఏం చేస్తున్నారని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిసింది. దీంతో గురువారం రాత్రి వావిలేటిపాడు అడ్డరోడ్డు దగ్గర, కలికవాయ రోడ్డులో కాపుకాసి ట్రాక్టర్లను పట్టుకున్నారు. టీడీపీ నేతలు రెవెన్యూ సిబ్బందిని బెదిరించి ట్రాక్టరును తీసుకుని వెళ్లిపోయారు. వావిలేటిపాడు వద్ద ట్రాక్టర్లను తహశీల్దార్ ఆపారు. ఆ తరువాత ఏమైందో తెలియదు కానీ ఎటువంటి జరిమానా కానీ, కేసు కానీ లేకుండా వదిలేశారు. ఇసుక, మట్టి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా పోలీసు ఉన్నతాధికారులు స్పష్టంగా చెబుతున్నా వాటిని నియోజకవర్గంలో పోలీసులు పట్టించుకున్న దాఖలాలు కనిపించడంలేదు. మట్టి, ఇసుక మాఫియా చెలరేగిపోతున్నా పోలీసులు పట్టించుకోకపోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గ్రావెల్, ఇసుక అక్రమ రవాణాపై సింగరాయకొండ తహశీల్దార్ టీ రవిని వివరణ కోరగా ఇతర మండలాల్లో ఇసుక రీచ్‌లు ఉన్నాయే కానీ మండలంలో లేవని, పనిభారం ఎక్కువగా ఉండటంతో ఇసుక అక్రమ రవాణా పై దృష్టి సారించలేకపోతున్నామని, గ్రావెల్ రవాణాకు ఎటువంటి అనుమతులు ఇవ్వలేదన్నారు.

జెడ్పీలో బదిలీల రగడ

- రసాభాసగా మారిన జెడ్పీ సాధారణ బదిలీలు
- మంత్రులు, ఎమ్మెల్యేల పీఏల జులుం
- అధికారపార్టీకి అనుకూలంగానే డిప్యూటీ సీఈఓ జాబితా తయారు
- జాయిన్ అయిన రికార్డు అసిస్టెంట్లకు డిప్యూటీ సీఈఓ బెదిరింపులు
- బదిలీకి రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు తీసుకుంటున్నారని ఆరోపణలు
- జెడ్పీ చైర్‌పర్సన్ నోట్ అప్రూవల్ లేకుండా బదిలీల ఉత్తర్వులు చెల్లుతాయా.?

ఒంగోలు సిటీ: జిల్లా పరిషత్‌లో సాధారణ బదిలీల రగడ నాలుగు రోజుల నుంచి రగులుతోంది. ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 22 వరకు గడువు విధించింది. ఈ నేపథ్యంలో జిల్లా పరిషత్ పరిధిలోని ఎంపీడీఓ, ఏఓ, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, రికార్డు అసిస్టెంట్లు, టైపిస్టులు, అటెండర్ల బదిలీలు తెరపైకి వచ్చాయి. అన్ని క్యాడర్లలోని ఉద్యోగుల బదిలీల్లో రాజకీయ నాయకుల జోక్యం పెరిగింది. దీంతో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు మధ్య విభేదాలు వచ్చాయి. ప్రభుత్వ నిబంధనల మేరకు జెడ్పీ పరిధిలోని ఉద్యోగుల బదిలీలపై పూర్తి స్థాయి అధికారం జెడ్పీ చైర్‌పర్సన్‌కు ఉంటుంది. జిల్లా పరిషత్ లో పూర్తి మెజారిటీ వైఎస్సార్ సీపీకి ఉన్నా.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన నేపథ్యంలో జిల్లాకు చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల పీఏలు డిప్యూటీ సీఈఓ గదిలో నాలుగు రోజుల నుంచి బదిలీలకు సంబంధించిన మంతనాలు జరుపుతున్నారు. డిప్యూటీ సీఈఓ అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల పీఏ లకు తొత్తుగా మారి జాబితాను వారికి అనుకూలంగా చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నెల 21వ తేదీ జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ 392 మంది బదిలీలకు సంబంధించి అప్రూవల్ ఫైల్ పై సంతకం చేశారు. అనంతరం డిప్యూటీ సీఈఓ 22వ తేదీ బదిలీ ఉత్తర్వులు ఇచ్చి, 23వ తేదీ ఉద్యోగులు వారికి కేటాయించిన ప్రాంతాల్లో జాయిన్ అవ్వాల్సి ఉండగా ఇంత వరకు వారికి ఉత్తర్వులు ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నారు.



జెడ్పీ కార్యాలయం నుంచి బయటకు వస్తున్న ప్రజాప్రతినిధుల పీఏలు

జెడ్పీ చైర్‌పర్సన్ అప్రూవల్ లేకుండా ఉత్తర్వులు చెల్లుతాయా..?

జెడ్పీ చైర్‌పర్సన్ ఇచ్చిన జాబితా కాకుండా అధికార పార్టీకి చెందిన మంత్రులు, ఎమ్మెల్యేల పీఏలు ఇచ్చిన జాబితాను జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు తయారు చేస్తున్నారని ఉద్యోగులు బహిరంగంగానే విమర్శిస్తున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ అప్రూవల్ ఇచ్చిన జాబితాను పక్కనపెట్టి, అధికారపార్టీకి అనుకూలంగా డిప్యూటీ సీఈఓ మొత్తం 400 మంది జాబితాను తయారు చేశారని, వీటికి సంబంధించి ఇచ్చిన ఉత్తర్వులు చెల్లుతాయా అని ఉద్యోగులు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు.

రికార్డు అసిస్టెంట్లకు బెదిరింపులు

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ ఇచ్చిన అప్రూవల్ కు సంబంధించి సుమారు 20 మంది రికార్డు అసిస్టెంట్లకు పోస్టులో, మెయిల్ ద్వారా ఉత్తర్వులు అందినట్లు సమాచారం. పుల్లలచెరువు మండలంలో చేరిన ఒక రికార్డు అసిస్టెంట్ జెడ్పీ హైస్కూల్‌లో జాయిన్ అయి రిజిస్టర్‌లో సంతకం కూడా చేస్తున్నారు. అయితే జెడ్పీ డిప్యూటీ సీఈఓ హనుమంతరావు మా వారిని అక్కడ వేయాలని, నీన్ను వేరే చోట వేస్తానని బెదిరిస్తున్నట్లు సమాచారం. జెడ్పీ ఉన్నతాధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారడమే కాకుండా బెదిరింపులు చేయడంతో ఉద్యోగులు బయటకు చెప్పలేక నానా ఇబ్బందులు పడుతున్నారు.

బదిలీకి రూ.20 నుంచి రూ.50 వేల వరకు..

జెడ్పీ సాధారణ బదిలీలకు సంబంధించి ఒక్కొక్కరి నుంచి రూ.20 వేల నుంచి 50 వేలను తీసుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జెడ్పీ సీఈఓ సంతకం లేకుండా డిప్యూటీ సీఈఓ సంతకంతో బదిలీల ఉత్తర్వులు ఇవ్వడం విమర్శలకు దారితీస్తోంది.

పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు: ప్రపంచ వ్యాప్తంగా అన్నీ దేశాలు పర్యాటక రంగంపై ప్రత్యేక దృష్టి సారించడంతో, ఈ రంగం అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. స్థానిక ఆంధ్ర కేసరి విద్యా కేంద్రంలో శుక్రవారం ఉదయం నిర్వహించిన ప్రపంచ పర్యాటక దినోత్సవంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ పర్యాటక రంగం ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 27వ తేదీ ప్రపంచ వ్యాప్తంగా పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రస్తుతం పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలు అధికంగా ఉన్నాయని, విద్యార్థులు ఈ రంగానికి సంబంధించిన నైపుణ్యాన్ని విద్యార్థి దశ నుంచే పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి విద్యార్థి రోజూ దినపత్రికలు చదివేలా అలవాటు చేసుకోవాలని, దానివలన సమాజంలో జరుగుతున్న విషయాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. జిల్లాలో కొత్తపట్నం, పాకల బీచ్ లు ప్రాచుర్యం పొందాయని, భైరవకోన, గుండ్ల బ్రహ్మేశ్వరం, నల్లమల తుమ్మల బయలు తదితర ఎకో పర్యాటక ప్రదేశాలు, గుండ్లకమ్మ, రామతీర్థం రిజర్వాయర్లు, సింగరాయకొండ, త్రిపురాంతకం, మార్కాపురం దేవాలయాలు మతపరమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయన్నారు. వీటిని మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లా పర్యాటక శాఖాధికారి బెన్హర్ మాట్లాడుతూ వ్యవసాయ రంగం తరువాత ఎక్కువ మందికి ఉపాధి కల్పిస్తోంది పర్యాటక రంగమన్నారు. పర్యాటకం, శాంతి అనే థీమ్‌తో 2024 ప్రపంచ పర్యాటక దినోత్సవం జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ ఆర్.ఐ.ఓ సైమన్ విక్టర్, జిల్లా యూత్ కో ఆర్డినేటర్ కమల్ సా, స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ, ఆంధ్రకేసరి విద్యా కేంద్రం ప్రిన్సిపాల్ విజయలక్ష్మి తదితరులు మాట్లాడుతూ పర్యాటక రంగ ప్రాధాన్యతను, అవసరాలను వివరించారు.



ప్రపంచ పర్యాటక దినోత్సవంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

అండర్ 19 రగ్బీ మోడరన్ పెంటాథ్లాన్ జిల్లా జట్ల ఎంపిక



బాలికల జట్టు

ఒంగోలు: రగ్బీ మోడరన్ పెంటాథ్లాన్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 19 జిల్లా బాలబాలికల జట్ల ఎంపిక శుక్రవారం స్థానిక ఏబీఎం జూనియర్ కాలేజీ ఆవరణలో నిర్వహించారు. ఏబీఎం కాలేజీ ప్రిన్సిపాల్ వాణి ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఆటల పోటీల్లో సామర్థ్యాలను వినియోగించి రాష్ట్ర స్థాయి పోటీల్లో విజేతగా రావాలని ఆకాంక్షించారు. స్పోర్ట్స్ సర్టిఫికెట్ ఉద్యోగ అవకాశాల్లో విద్యార్జన కోసం ప్రవేశాల్లో ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈదర చింపారెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బొడ్డు సుబ్బారావు మాట్లాడుతూ చదువుతోపాటు క్రీడల్లోను రాణిస్తే ఉన్నత అవకాశాలు త్వరగా అందుకోవడం సాధ్యపడుతుందని చెప్పారు.

బాలుర జట్టు:
సీహెచ్ స్టీఫెన్, జీ.కుమార్, ఎం.దేవేంద్రనాయక్, యు.తేజ, జీ.పుల్లారావు, పి.విశ్వవర్ధన్‌రెడ్డి, వై.యువతేజ, పి.యువరాజు, ఎం.వెంకట్, యస్‌కె హుస్సేన్ బాషా, ఎల్.జాన్‌పాల్, బి.అభిలాష్

బాలికల జట్టు:
టి.కళ్యాణి, వై.భువన దీపిక, డి.నిరంజని, కె.కార్తిక, పి.నందిని, ఆర్.లక్ష్మీకల్పన, కె.హవిల, సీహెచ్‌వీ మహేశ్వరి, యు.చంద్రలిఖిత, ఎం.గురులక్ష్మి, కె.జెస్సి, జి.అఖిల

రైతుల సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

- ఈ-పంట నమోదు, ఈకేవైసీ నూరుశాతం జరగాలి
- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్:

క్షేత్ర స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. ప్రకాశం భవనంలో శుక్రవారం వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. తొలుత ఆయా శాఖల ద్వారా అమలవుతున్న కార్యక్రమాలు, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు, సాధించిన ప్రగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించకూడదన్నారు. రైతులంతా ఈ-పంట నమోదు చేసుకునేలా చూడాలని, ఈకేవైసీ కూడా నూరు శాతం జరిగేలా చూడాలన్నారు. రబీ 2024కు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జిల్లాలో ఖరీఫ్ 2024లో 45 వేల సీసీఆర్‌సీ కార్డులు కౌలు రైతులకు ఇచ్చేలా లక్ష్యంగా నిర్ణయించగా ఇప్పటి వరకు 42,033 కార్డులు జారీ చేశారని, మిగిలిన కార్డుల జారీకి చర్యలు తీసుకోవాలన్నారు. డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని ప్రోత్సహించేలా చర్యలు చేపట్టాలన్నారు. దీనిలో వ్యవసాయ శాఖ జేడీ శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ జేడీ బేబిరాణి, మత్స్యశాఖ జేడీ చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఉద్యానవన అధికారి గోపిచంద్, ఏపీఎంఐపీ పీడీ రమణ, సెరీకల్చర్ అధికారి సుజయ్‌కుమార్, మార్కెటింగ్ ఏపీ సీడ్స్ అధికారులు పాల్గొన్నారు.



వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

రేపు ఎస్‌టీయూ టెట్ మోడల్ పరీక్ష

ఒంగోలు: ఎస్టీయూ ఏపీ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో జిల్లాలో ఏపీ టెట్ మోడల్ పరీక్ష నిర్వహిస్తారని ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే యర్రయ్య, జీ నరసింహా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భవిష్య అకాడమీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారికి 29న మధ్యాహ్నం రెండు గంటలకు ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. పరీక్షలో ప్రతిభ చాటిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందిస్తారని తెలిపారు. పూర్తి వివరాలకు 9000277050, 8185010221, 9440248772లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

దేవర బెనిఫిట్ షోలో వివాదం.. ఒకరికి గాయాలు


చికిత్స పొందుతున్న దాల్డా శ్రీను

యర్రగొండపాలెం: జూనియర్ ఎన్టీఆర్ హీరోగా నటించిన దేవర సినిమా రిలీజ్ సందర్భంగా శుక్రవారం స్థానిక ఒక థియేటర్లో బెనిఫిట్ షో వేశారు. షో ఇంటర్వెల్లో బయటికి వెళ్తున్న దాల్డా శ్రీను దారికి అడ్డంగా ఉన్నవారిని పక్కకు తొలగమని చెప్పాడు. దీంతో కోపోద్రిక్తులైన వారు శ్రీనుపై దాడికి దిగి తీవ్రంగా గాయపరిచారు. అంతేకాకుండా మేము టీడీపీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఎరిక్షన్బాబు మనుషులమని అతనిని హెచ్చరించారు. శ్రీను కూడా టీడీపీ వర్గానికి చెందినవాడు కావడం గమనార్హం. గాయపడిన అతని తలకు 4 చోట్ల కుట్లు వేసినట్లు ప్రభుత్వ వైద్యులు తెలిపారు.

జెడ్పీ సీఈఓగా బాధ్యతలు చేపట్టిన చిరంజీవి


జిల్లా కలెక్టరు తమీమ్ అన్సారియాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న జెడ్పీ సీఈఓ చిరంజీవి

ఒంగోలు సిటీ: ప్రకాశం జిల్లా పరిషత్ సీఈఓగా భూపతి చిరంజీవి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. నెల్లూరు జెడ్పీ డిప్యూటీ సీఈఓగా చిరంజీవి పనిచేస్తూ సాధారణ బదిలీల్లో భాగంగా ప్రకాశం జిల్లా జెడ్పీ సీఈఓగా వచ్చారు. అంతకు ముందు కలెక్టర్ తమీమ్ అన్సారియా కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.

జూనియర్ లైన్మన్ మృతి


మృతి చెందిన అశోక్

కంభం: రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న జూనియర్ లైన్మన్ అశోక్ శుక్రవారం మృతి చెందారు. వివరాలు.. చిన్న కంభం పంచాయతీ పరిధిలోని దేవనగరానికి చెందిన అశోక్ బేస్తవారిపేటలో జూనియర్ లైన్మెన్గా విధులు నిర్వహిస్తున్నారు. 15 రోజుల క్రితం బేస్తవారిపేట వద్ద రోడ్డు ప్రమాదంలో అశోక్ తీవ్రంగా గాయపడ్డారు. నర్సరావుపేటలో చికిత్స పొంది మూడు రోజుల క్రితం డిశ్చార్జి అయ్యారు. శుక్రవారం ఆరోగ్య పరిస్థితి విషమించి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహానికి కంభం ప్రభుత్వ వైద్యశాలలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఉరేసుకుని యువకుడు మృతి


మృతుడు యేసుపోగు చంటి

కనిగిరి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో ఉరేసుకుని యువకుడు మృతి చెందిన సంఘటన పట్టణంలోని సూరా పాపిరెడ్డి కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం హనుమంతునిపాడు మండలం కూటాగుండ్ల గ్రామానికి చెందిన యేసుపోగు చంటి(33) కనిగిరి పట్టణంలో బేల్దారి పని చేస్తూ.. స్థానిక సూరాపాపిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్నాడు. చంటి మద్యానికి బానిస కావడంతో కుటుంబంలో కలహాలు రేగాయి. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రేకుల షెడ్డులోని రాడ్డుకు చున్నీతో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి తండ్రి యేసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై భాస్కర్రావు తెలిపారు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్కు తీవ్ర గాయాలు


లారీ క్యాబిన్లో ఇరుక్కున్న డ్రైవర్ దావూద్

సింగరాయకొండ: రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్కు తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం తెల్లవారుజామున జాతీయ రహదారిపై సింగరాయకొండ లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయం సమీపంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కోల్కతాకు చెందిన లారీ డ్రైవర్ దావూద్ బెంగళూరుకు కూరగాయల లోడ్తో వెళ్తున్నాడు. స్థానిక యూనియన్ ఆఫీసు సమీపంలోకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకుని ముందు వెళ్తున్న లారీని ఢీకొట్టాడు. క్యాబిన్ నుజ్జు నుజ్జవడంతో డ్రైవర్ దావూద్ అందులోనే ఇరుక్కుపోయాడు. హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని జేసీబీ సాయంతో దావూద్ను అతి కష్టం మీద బయటకు తీశారు. దావూద్ కుడికాలు విరగగా 108 వాహనంలో ఒంగోలు జీజీహెచ్కు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

సైబర్ నేరాల కట్టడికి చర్యలు

- నేర సమీక్ష సమావేశంలో ఎస్పీ ఏఆర్ దామోదర్


నేర సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ ఏఆర్ దామోదర్, ఏఎస్పీలు ఎస్వీ శ్రీధర్ రావు, నాగేశ్వరరావు

ఒంగోలు టౌన్: సైబర్ నేరాలను కట్టడి చేయడానికి ప్రణాళికాబద్ధంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. పోలీసు స్టేషన్ల వారీగా పెండింగ్ కేసుల వివరాలను, అరెస్టు వివరాలు, కేసు దర్యాప్తు తీరుతెన్నుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అరెస్టులు, చార్జిషీట్లు, నాన్ బెయిలబుల్ వారంట్లు పెండింగ్లో ఉంచకుండా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్లో ఉన్న సైబర్ కేసుల విచారణను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలు సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణ పూర్తి చేసి నిర్ణీత కాలంలో కోర్టులో చార్జిషీటు దాఖలు చేయాలని చెప్పారు. గంజాయి వంటి నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, విక్రయాలను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదృశ్యం కేసులను అలక్ష్యం చేయవద్దని, పోక్సో కేసులు, రేప్ కేసులలో దర్యాప్తులో మరింత వేగాన్ని పెంచాలని చెప్పారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి విద్యార్థినులకు తెలియజేసేందుకు తగిన కార్యక్రమాలు రూపొందించాలని చెప్పారు. రహదారి ప్రమాదాలను నివారించేందుకు బ్లాక్ స్పాట్లను గుర్తించాలని చెప్పారు. ఎక్కువగా ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, దొంగతనం కేసుల్లో నిందితులను త్వరగా పట్టుకొని ప్రాపర్టీ రికవరీని పెంచాలన్నారు. దసరా, దీపావళి పండుగలను దృష్టిలో ఉంచుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనధికారికంగా బాణాసంచా తయారీ, నిల్వలు, రవాణా వంటి వాటిని నియంత్రించాలని ప్రమాదాలను నిలువరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. పోలీసు సిబ్బంది ప్రవర్తన సరిగా లేకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవిడెన్స్ యాక్టు, రిలేటింగ్ టు ఇన్వెస్టిగేషన్ గురించి, బాధితుల నుంచి కేసులను ఏ విధంగా స్వీకరించాలి, కేసు ఎలా నమోదు చేయాలి అనే విషయాల గురించి ఒంగోలు మూడో అదనపు జిల్లా కోర్టు జడ్జి డి.రాములు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసులకు ప్రశంస పత్రాలు అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఏఎస్పీ (క్రైం) ఎస్వీ శ్రీధర్ రావు, ఏఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీలు రాయపాటి శ్రీనివాసరావు, లక్ష్మి నారాయణ, నాగరాజు, ఎస్బీ సీఐ రాఘవేంద్ర, ఐటీ కోర్ సీఐ సూర్యనారాయణ, పోలీసు లీగల్ అడ్వైజర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

పాలన గాలికొదిలి లడ్డూపై రాజకీయాలు సిగ్గుచేటు


సీపీఐ జెండా ఆవిష్కరిస్తున్న సీనియర్ నాయకులు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య
- పామూరులో సీపీఐ రాజకీయ శిక్షణ తరగతులు

పామూరు: కూటమి నేతలు రాష్ట్రంలో పాలన గాలికి వదిలేసి తిరుమల లడ్డూ పేరుతో రాజకీయాలు చేయడం సిగ్గుచేటని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, జిల్లా ఇన్చార్జ్ గుజ్జుల ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పనులు లేక కూలీలు, ఉద్యోగాలు లేక యువత, వేతనం రాక ఉద్యోగులు, వరదల్లో సర్వం కోల్పోయి ప్రజలు అల్లాడుతున్నారని, వారిని ఆదుకోవాల్సిన ప్రభుత్వం లడ్డూ కల్తీ పేరుతో సమస్యలను పక్కదారి పట్టిస్తోందని దుయ్యబట్టారు. శుక్రవారం పామూరులో జాతీయ రహదారి పక్కన సీపీఐ నేత నీరుకట్టు మస్తానయ్య ప్రాంగణంలో 3 రోజుల జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు పార్టీ మండల కార్యదర్శి పోతల ప్రభాకర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి అధ్యక్షతన ప్రారంభమయ్యాయి. ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య మాట్లాడుతూ.. తిరుమలలో తప్పు జరిగి ఉంటే అధికారంలో ఉన్నవారు విచారణ చేయించాల్సిందిపోయి దేవుళ్లు, మతాల పేరుతో రాజకీయ లబ్ధి పొందాలనుకోవడం బాధాకరమన్నారు. డిప్యూటీ సీఎంగా బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న పవన్కల్యాణ్ తిరుమల లడ్డు అపవిత్రమైందంటూ ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టి విజయవాడ దుర్గమ్మ ఆలయ మెట్లు శుద్ధి చేయడం అవివేకపు చర్య అని అన్నారు. పెట్టుబడిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఊడిగం చేస్తున్నాయని విమర్శించారు. మహిళలు, చిన్నారులపై అత్యాచారాలు ప్రభుత్వానికి పట్టవా అని ప్రశ్నించారు. సిద్ధాంతాలు, ప్రజల కోసం కాకుండా వ్యక్తిగత స్వార్థంతో పార్టీలు మారడం ఆనవాయితీ అయిపోయిందని మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. పేద ప్రజల తరఫున పోరాడేందుకు కమ్యూనిజం ఎప్పటికీ ఉంటుందన్నారు. ముందుగా సీపీఐ జెండాను పార్టీ శ్రేణులతో కలిసి ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి మన్నేపల్లి లక్ష్మీనారాయణ, మాజీ కార్యదర్శి యం.వెంకయ్య, వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా కార్యదర్శి ఆర్.వెంకట్రావు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు సయ్యద్ యాసిన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు డి.శ్రీనివాసులు, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి, ఆర్.బ్రహ్మారెడ్డి, జిల్లా నాయకుడు నాసరయ్య పాల్గొన్నారు.

పేద ఖైదీలకు ప్రభుత్వ సాయం

- కలెక్టర్ తమీమ్ అన్సారియా


ఎంపవర్మెంట్ కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు అర్బన్: బెయిల్ వచ్చినా షూరిటీ లేక ఇబ్బంది పడుతున్న పేద ఖైదీలకు ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయం అందిచాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా సూచించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా ఎంపవర్మెంట్ కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా జైలులోని ఖైదీలు, కేసుల పరిస్థితులు, బెయిల్ తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ప్రతి ఆరు నెలలకు ఒకసారి సమావేవం నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం జిల్లా జైలులో 210 మంది ముద్దాయిలు, 198 మంది విచారణ ఖైదీలు ఉన్నారని కమిటీ కన్వీనర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ వరుణారెడ్డి కలెక్టర్కు వివరించారు. వివిధ కేసుల్లో బెయిల్ మంజూరైనా తగిన ష్యూరిటీ లభించక ముగ్గురు పేద ఖైదీలు జైల్లోనే ఉన్నారని తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ.. వారు నిజంగా పేదలో కాదో విచారించి బెయిల్పై విడుదలయ్యేలా సహాయం అందించాలని సూచించారు. సమావేశంలో ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.దీనా, ప్రొబేషన్ అధికారి బాలప్రభాకర్, పోలీసు శాఖ తరఫున ఐటీ కోర్ ఇన్స్పెక్టర్ సూర్యనారాయణ, జైలర్ రమేష్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దొంగల దాడిలో గాయపడిన వృద్ధురాలు మృతి

- పోలీసుల అదుపులో దొంగ?


సీతారావమ్మ మృతదేహం

ఒంగోలు టౌన్: ఒంగోలు నగరంలోని కాకతీయనగర్లో జరిగిన చోరీ ఘటనలో దొంగల దాడిలో గాయపడిన వృద్ధురాలు సీతారావమ్మ మృతి చెందారు. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. కాకతీయనగర్ రెండో లైనులో 80 ఏళ్ల పొన్నం సీతారావమ్మ ఒంటరిగా నివసిస్తున్నారు. మంగళవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో ఇంట్లోకి ప్రవేశించిన దొంగలతో ఆమె తీవ్రంగా ప్రతిఘటించారు. ఇంతలో ఆమె ముఖానికి ముసుగేసిన దొంగలు.. కేకలు వేయకుండా నోట్లో గుడ్డలు కుక్కారు. చేతులు కట్టేసి ముఖం, ఛాతీ మీద పిడిగుద్దులు గుద్దారు. ఆమె స్పృహ కోల్పోగానే చెవులకు ఉన్న బంగారు కమ్మలు, బీరువాలో రూ.లక్ష నగదుతో ఉడాయించారు. కాగా దొంగల దాడిలో గాయపడిన సీతారావమ్మ శుక్రవారం తెల్లవారుజామున మరణించారు. ఆమె ఛాతీ బాగం బాగా కమిలిపోయినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సీతారావమ్మ భర్త యలమంద రైల్వే స్టేషన్ మాస్టరుగా చేసి రిటైరైన తర్వాత మరణించారు. వారికి ముగ్గురు సంతానం కాగా ఒక కుమారుడు, కుమార్తె కూడా మరణించారు. మరో కుమార్తె నల్లూరి పద్మ లింగంగుంట్ల జిల్లా పరిషత్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వర్తిస్తున్నారు. చోరీకి పాల్పడిన దొంగల్లో ఒకరిని ఫింగర్ ప్రింట్స్ ఆధారంగా పోలీసులు ఇప్పటికే అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మరో దొంగ చెన్నైలో ఉన్నట్లు సాంకేతిక పరిజ్ఞానం సాయంతో పోలీసులు గుర్తించినట్లు తెలిసింది.

జీజీహెచ్లో వినికిడి పరీక్షలు

- అందుబాటులోకి వచ్చిన బెరా
- ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ వెల్లడి


బెరా పరికరాన్ని పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ ఏడుకొండలు, సూపరింటెండెంట్ దుర్గాదేవి

ఒంగోలు టౌన్: వినికిడి లోపం ఉన్నవారిని గుర్తించే ఆధునిక బెరా పరీక్షలు ఒంగోలులోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో అందుబాటులోకి వచ్చినట్లు ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏడుకొండలు వెల్లడించారు. జీజీహెచ్లోని 213వ నంబర్ గదిలో బెరా వైద్య పరికరాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. శుక్రవారం బెరా పరీక్షల పనితీరును జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ దుర్గాదేవితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బెరా పరీక్షల ద్వారా అత్యుత్తమ పద్ధతుల్లో వినికిడి లోపాన్ని గుర్తించవచ్చని చెప్పారు. సదరం సర్టిఫికెట్ల జారీతోపాటు ఇతర వైద్య సేవల్లో ఈ పరికరం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ఈఎన్టీ హెచ్ఓడీ డాక్టర్ ప్రభాకరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సామగ్రి దుకాణంలో చోరీ

- గోడకు రంధ్రం వేసి లోపలికి చొరబడిన దొంగలు
- సుమారు రూ.లక్ష నగదు, విద్యుత్ వైర్ల కట్టలు అపహరణ
- సీసీ కెమెరాల హార్డ్ డిస్క్నూ ఎత్తుకెళ్లిన దొంగలు


దుకాణం గోడకు వేసిన రంధ్రం


సీసీ ఫుటేజీలో దొంగ చిత్రం

కంభం: విద్యుత్ ఉపకరణాల దుకాణానికి దొంగలు కన్నం వేసి చోరీకి పాల్పడిన సంఘటన కంభం బస్టాండ్ సమీపంలో గురువారం అర్ధరాత్రి తర్వాత చోటుచేసుకుంది. వివరాలు.. బస్టాండ్ సమీపంలోని గౌరీశంకర్ ఎంటర్ప్రైజెస్ ఎలక్ట్రికల్ దుకాణం గోడకు రంధ్రం వేసి లోనికి ప్రవేశించిన దొంగలు కౌంటర్లో ఉన్న సుమారు రూ.లక్ష నగదు, విద్యుత్ వైర్లు అపహరించారు. శుక్రవారం ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన సిబ్బంది చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం అందించారు. షాపు యజమాని 4 రోజుల క్రితం షిర్డీ యాత్రకు వెళ్లగా సిబ్బంది నిర్వహిస్తున్నారు. మూడు రోజులుగా వచ్చిన సామగ్రి విక్రయించగా వచ్చిన సుమారు రూ.లక్ష నగదును కౌంటర్లోనే ఉంచినట్లు చెబుతున్నారు. యజమాని వస్తే ఎంత నష్టం జరిగిందో తెలుస్తుంది. క్లూస్ టీమ్ బృందం సంఘటనా స్థలాన్ని పరిశీలించి వేలిముద్రలు సేకరించింది. దొంగలు వెళ్లిపోతూ సీసీ కెమెరాల హార్డ్ డిస్క్ సైతం ఎత్తుకెళ్లారు. గతంలో కూడా ఓ సూపర్ మార్ట్, ఓ గృహంలో చోరీ జరగగా అక్కడ కూడా దొంగలు సీసీ కెమెరాల హార్డ్డిస్క్లు అపహరించారు.

సీసీ ఫుటేజీలో దొంగల ఆనవాళ్లు

చోరీ జరిగిన దుకాణానికి పక్కనే ఉన్న షాపుల సీసీ కెమెరాల్లో దొంగల ఆనవాళ్లు నిక్షిప్తమయ్యాయి. గురువారం రాత్రి 12.30 గంటల సమయంలో వచ్చి తెల్లవారుజామున 4.50 గంటల వరకు దుకాణంలోనే ఉన్నట్లు తెలుస్తోంది. 24 గంటలూ వాహనాలు తిరుగుతూ రద్దీగా ఉండే ప్రధాన రహదారిలో చోరీ జరగడంతో చుట్టుపక్కల దుకాణదారులు ఆందోళన చెందుతున్నారు.


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

ఫీల్డ్ అసిస్టెంట్ల మెడపై కత్తి!

- పొదిలి మండలంలో టీడీపీ నాయకుల బెదిరింపు
- బలవంతంగా ఐదుగురితో రాజీనామా

పొదిలి రూరల్: కూటమి ప్రభుత్వం గద్దెనెక్కినప్పటి నుంచి పొదిలి మండలంలో టీడీపీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతూ, అధికారులపైనా ఒత్తిడి చేస్తుండటంతో ఐదుగురు ఫీల్డ్ అసిస్టెంట్లు శుక్రవారం రాజీనామా చేశారు. పొదిలి మండలంలోని 16 పంచాయతీల్లో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 16 మంది ఫీల్డ్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే వేధించడం మొదలు పెట్టారు. టీడీపీ నేతల వేధింపులు తట్టుకోలేక మండలంలోని అన్నవరం, తలమళ్ల, ఈగలపాడు, పాములపాడు, కుంచేపల్లి గ్రామాల్లో ఎఫ్ఏలు రాజీనామా చేశారు. మిగిలిన మూగచింతల, ఓబులక్కపల్లి, సలకనూతల, మల్లవరం, జువ్వలేరు, అక్కచెరువు, తుమ్మగుంట్ల, సూదనగుంట, ఏలూరు, ఉప్పలపాడు, ఆముదాలపల్లి గ్రామాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లపై టీడీపీ నేతలు తరచూ ఫిర్యాదులు చేస్తూ వేధిస్తున్నారు. వీరిలో కొందరు 2006లో ఉపాధి హామీ పథకం ప్రారంభించినప్పటి నుంచి పనిచేస్తున్న వారితోపాటుపాటు ఆ తర్వాత కాలంలో విధుల్లో చేరిన వారు కూడా ఉన్నారు.

పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్గా ఎంపీ మాగుంట

ఒంగోలు సబర్బన్: హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్గా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డిని లోక్సభ స్పీకర్ నియమించారు. అందుకుగాను కేంద్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. 2024–25 సంవత్సరానికి సంబంధించి స్టాండింగ్ కమిటీ చైర్మన్గా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కమిటీలో సభ్యులుగా మొత్తం 31 మంది ఎంపీలు ఉంటారు. వారిలో లోక్సభ నుంచి 21 మంది, రాజ్యసభ నుంచి 10 మంది ఎంపీలు ఉంటారు.

30న ఎస్జీఎఫ్ అండర్ 14,17 క్రీడా జట్ల ఎంపిక

ఒంగోలు: ప్రకాశం జిల్లా (ఉమ్మడి) పరిధిలోని అన్ని మేనేజ్మెంట్ ల పాఠశాలలకు చెందిన బాల బాలికల జిల్లా స్థాయి ఎస్.జీ.ఎఫ్ క్రీడాజట్ల ఎంపిక ఈనెల 30న పలు ప్రాంతాల్లో నిర్వహిస్తున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి కె.వనజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెపక్ తక్రా 14,17 సంవత్సరాల బాల బాలికలకు ఉదయం 9 గంటలకు కొనకనమిట్ల మండలం గొట్లగట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, తైక్వాండో 14, 17 సంవత్సరాల బాల బాలికలకు ఉదయం 9 గంటలకు ఒంగోలు ఇస్లాంపేటలో ఉన్న ముస్లిం కమ్యూనిటీ హాల్లో, బాక్సింగ్ 14, 17 సంవత్సరాల బాల బాలికలకు మధ్యాహ్నం 2 గంటలకు డా.ఆనంద్ మినీ స్టేడియం ఒంగోలులో, వాలీబాల్ 14 సంవత్సరాల బాల, బాలికలకు ఉదయం 9 గంటలకు ఎస్ఎన్పాడు మండలం పేర్నమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులు ఆసక్తి కలిగిన విద్యార్థులతో ఆన్లైన్ ఎంట్రీ చేసుకుని, మాన్యువల్ ఎంట్రీ ఫార్మ్తో వచ్చి సెలెక్షన్స్లో పాల్గొనాలని కోరారు. 17 సంవత్సరాల కేటగిరీలో పాల్గొనే ఇంటర్మీడియెట్ విద్యార్థులు పదో తరగతి మార్కుల లిస్టు, ఆధార్ కార్డు, జ్ఞానభూమి చైల్డ్ ఐడీ నంబరు, సంబంధిత ప్రిన్సిపల్ ధ్రువీకరణతో నిర్వాహకులకు సమర్పించి పాల్గొనవచ్చు.

భూ సేకరణ వేగవంతం చేయాలి

- జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ


భూసేకరణపై సమీక్షిస్తున్న జేసీ గోపాలకృష్ణ

ఒంగోలు అర్బన్: జిల్లాలో జాతీయ రహదారులు, ప్రతిపాదిత రైల్వే మార్గాలకు సంబంధించి పెండింగ్లో ఉన్న భూ సేకరణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో భూ సేకరణ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. నడికుడి–శ్రీకాళహస్తి రైల్వే మార్గంతో పాటు 565, 544(డి), 544(జి), 216, 765, 167(బి) జాతీయ రహదారులకు సంబంధించిన భూ సేకరణలో పురోగతిపై ఆరా తీశారు. పునరావాసంతో పాటు పెండింగ్లో ఉన్న నష్టపరిహారం, కోర్టు కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, కనిగిరి ఆర్డీఓ జాన్ ఇర్విన్, ఒంగోలు ఆర్డీఓ సుబ్బారెడ్డి, జాతీయ రహదారులు, రైల్వే శాఖ అధికారులు, పలు మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో హుండీ స్వాహా!

- చెప్పులు వదిలి గర్భగుడిలోకి వెళ్లి హుండీ చోరీ
- ఒంగోలులోని రాందేవ్ బాబా ఆలయంలో ఘటన


హుండీ పగుల గొడుతున్న దొంగ

ఒంగోలు టౌన్: ఆలయంలో చోరీకి వెళ్లిన ఓ దొంగ భక్తిశ్రద్ధలను మాత్రం వీడలేదు. చెప్పులు వదిలి మరీ గర్భగుడిలోకి ప్రవేశించి హుండీ కానుకలు చోరీ చేశాడు. ఈ సంఘటన ఒంగోలు నగరంలోని గుంటూరు రోడ్డులో ఉన్న రాందేవ్ బాబా దేవాలయంలో గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. రాందేవ్ బాబా ఆలయ వాచ్మన్ సెలవులో రాజస్థాన్ వెళ్లాడు. కాపలా ఎవరూ లేరని గుర్తించిన ఓ దొంగ దర్జాగా లోపలికి ప్రవేశించి ఇనుప రాడ్డుతో హుండీ పగలగొట్టాడు. తీరిగ్గా కూర్చుని సొమ్ము లెక్కబెట్టుకున్నాడు. గుడిలోనే వెదికి తెచ్చుకొన్న క్యారీ బ్యాగులో నగదు వేసుకుని, గర్భగుడిలో ఇంకా ఏమైనా దొరుకుతాయో మోనని వెదికాడు. ఈ చోరీ తంతు మొత్తం సీసీ ఫుటేజీలో నిక్షిప్తమైంది. కాగా గుడిలో చోరీపై పోలీసులకు కమిటీ సభ్యులు ఇంకా ఫిర్యాదు చేయలేదు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి


మృతి చెందిన బాలయ్య


మృతుడు ఖాసింసాహెబ్


చికిత్స పొందుతున్న మహబూబ్సాహెబ్

బేస్తవారిపేట: జిల్లాలో శుక్రవారం వేర్వేరు ప్రాంతాల్లో సంభవించిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి చెందారు. బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు సమీపంలో ఒంగోలు–నంద్యాల హైవేరోడ్డుపై జరిగిన ప్రమాదంలో రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి మృతి చెందారు. పూసలపాడుకు చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఉదయగిరి బాలయ్య(60) శుక్రవారం తెల్లవారుజామున హైవేపై వాకింగ్కు వెళ్లాడు. అదే సమయంలో గిద్దలూరు ఆర్మీ క్యాంటీన్ నుంచి స్కూటీపై వస్తున్న కంభం వాసి మేడం రమణయ్య లారీని ఓవర్ టేక్ చేయబోయి బాలయ్యను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన బాలయ్యను ఒంగోలులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందారు. మృతుడికి భార్య కాశమ్మ, నలుగురు పిల్లలు ఉన్నారు. స్కూటీ నుంచి కింద పడిన రమణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

తోకపల్లి వద్ద కారు ఢీకొని మరొకరు..

పెద్దారవీడు: ద్విచక్ర వాహనంపై వెళ్తున్న తాతామనవళ్లను వెనుక నుంచి మినీ ట్రక్ ఢీకొనడంతో తాత అక్కడికక్కడే మృతి చెందగా మనవడికి గాయాలయ్యాయి. ఈ సంఘటన పెద్దారవీడు మండలం తోకపల్లి సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మార్కాపురం పట్టణానికి చెందిన ఖాసింసాహెబ్, మనవడు మహబూబ్సాహెబ్తో కలిసి హనుమాన్ జంక్షన్ కుంట మీదుగా దోర్నాలకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. తోకపల్లి సమీపంలోకి రాగానే.. గిద్దలూరు నుంచి గుంటూరుకు కూరగాయల లోడ్తో వెళ్తున్న మినీ ట్రక్ వెనుక నుంచి వేగంగా ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఖాసింసాహెబ్(58) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు స్పందించి చిన్నారి మహబూబ్సాహెబ్ను 108లో మార్కాపురం జిల్లా వైద్యశాలకు తరలించారు. ఖాసింసాహెబ్ కూతురి కొడుకు మహబూబ్సాహెబ్ కురిచేడులో 6వ తరగతి చదువుతున్నాడు. దోర్నాలలో ఉంటున్న కూతురి వద్ద మనవడిని వదిలిపెట్టేందుకు వెళ్తుండగా మార్గమధ్యంలో మృత్యువు కాటేసింది.